తాగునీటి లోపాలపై పర్యవేక్షణ కమిటీ

ప్రజాశక్తి-మామిడికుదురు

వర్షాకాలం లో సీజనల్ వ్యాధులు, నివారణ మరియు మంచినీటి మంచినీటి పైపులు లీకేజ్ లు, పారిశుధ్య అంశాలపై లోపాల నిర్వహణకు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేసినట్లు ఎంపిడిఒ వేణుగోపాల రెడ్డి శనివారం తెలిపారు. ఈ కమిటీలో ఎంపిపి కుసుమ వనజ కుమారి, ఎంపిడిఒ ఎస్.వేణుగోపాలరెడ్డి, ఎఇఇ ఆర్‌డబ్ల్యుఎస్ జి.జయశ్రీ, ఇఒపిఆర్‌డి అడబాల శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారి ఎవివి.లక్ష్మీనారాయణ, నగరం పిహెచ్ సి వైద్యాధికారి కెజె.ప్రశాంత్, లూటుకుర్రు పి హెచ్‌సి వైద్యాధికారి ఎం స్పందన, ఐసిడిఎస్ సూపర్ వైజర్లతో పర్యవేక్షణ కమిటీ ఏర్పాటు చేశామన్నారు. గ్రామాల్లో పైప్ లైన్ లీకులు తో పాటు పారి శుధ్య నిర్వహణ పనులపై లోపాలుంటే పర్యవే క్షణ కమిటీ దృష్టికి తీసుకురావాలని అన్నారు.

బరువెక్కిన పాఠశాల బ్యాగ్

- పెరుగుతున్న బడి పుస్తకాల బరువు
- అధికంగా కొనుగోలు చేయిస్తున్న వైనం
- ఎదుగుదల, ఆరోగ్యంపై ప్రభావం

ప్రజాశక్తి-కాకినాడ ప్రతినిధి

జిల్లాలో ప్రైవేటు, కార్పొరేట్ విద్యాసంస్థల్లో ఒత్తిడితో కూడిన విద్యా బోధనతో విద్యార్థులు నానా అవస్థలూ పడుతున్నారు. మరోవైపు బండెడు పుస్తకాలతో కుస్తీ పడుతూ అనారోగ్యాలకు గురవుతున్నారు. కేజీల కేజీల బరువైన పుస్తకాలను మోస్తూ పాఠశాల విద్యార్థులు అష్టకష్టాలు పడుతున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో చదువు కొనేందుకు ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. బడి పుస్తకాలను మోయడం వల్ల వేలాది మంది పిల్లల ఎదుగుదల, ఆరోగ్యంపై ప్రభావం చూపుతుందని వైద్యులు గగ్గోలు పెడుతున్నారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల్లో పుస్తకాల భారం ఎక్కువగా ఉంటుంది.

ప్రైవేటు ఇష్టారాజ్యం

ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో సుమారు 1800 ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు ఉన్నాయి. వీటిలో 3 లక్షల 30 వేల మంది ఏటా చదువుతున్నారు. సర్కారు బళ్లను మినహాయిస్తే ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల స్కూలు బ్యాగుల బరువు అధికంగా ఉంటోంది. టెక్నాలజీ రోజు రోజుకూ అభివృద్ధి చెందుతున్నా విద్యా విధానంలో మార్పులు కానరావడం లేదు. చదువుల భారంతో పుస్తకాల బరువుతో విద్యార్థులు సతమతమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. ఎన్ని ఎక్కువ పుస్తకాలు ఉంటే అంత బాగా చదువుతారనే పరిస్థితిలోకి ఆయా విద్యాసంస్థల ప్రచారం నిర్వహిస్తున్నాయి. తమ వ్యాపార స్వలాభం కోసం అవసరానికి మించి పలు ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థలు భారీగా పుస్తకాలను కొనుగోలు చేస్తున్నాయి. వాటి ధరలను విపరీతంగా పెంచి విక్రయాలు జరుపుతున్నాయి అయినా విద్యాశాఖ అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు.



నిబంధనల ప్రకారం

సాధారణంగా 8 నుంచి 10 తరగతి చదివే ఆరోగ్యకరమైన చిన్నారి బరువు 25 నుండి 35 కేజీలు ఉంటుంది. కార్పొరేట్ పాఠశాలల్లో చదువుతున్న పిల్లలు 10 నుంచి 15 కేజీల బరువున్న పుస్తకాల బ్యాగులను మోసుకుంటూ వెళుతున్నారు. నిబంధనల ప్రకారం 1 తరగతి విద్యార్థి 750 గ్రాములు, 2వ తరగతి 2 కేజీలు, 3, 4 తరగతుల పిల్లలు 3 కేజీలు, 5వ తరగతి 4 కేజీలు, 6 తరగతి 6 కేజీలు, 7వ తరగతి 8 కేజీలు, 8వ తరగతి 10 కేజీలు, 9, 10 తరగతుల పిల్లలు 12 కేజీలు మాత్రమే బరువు మోయల్సి ఉంది. ఈ నిబంధనలకు భిన్నంగా రెట్టింపు బరువు మోస్తున్నారు.

అనారోగ్య సమస్యలు

ఆయా స్కూల్ బ్యాగులను మోస్తున్న విద్యార్థులు చిన్న వయసులోనే నడుము, మోకాళ్ల నొప్పులు, ఇతరత్రా అర్థో సమస్యలతో బాధ పడుతున్నట్లు తల్లిదండ్రులు వెల్లడిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్కూలు బ్యాగుల బరువును తగ్గించాలని భావించిన ప్రభుత్వం గతంలో ఆయా పాఠశాలల యాజమాన్యాలకు పలు మార్గదర్శకాలు జారీ చేసింది. కానీ వీటిని అమలుచేయాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు.

పట్టని ప్రైవేట్ విద్యాసంస్థలు

బరువులు పిల్లల ఎదుగుదల, ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందని యూనిసెఫ్‌తో బాటు వివిధ సంస్థల సర్వేలు చెబుతున్నాయి. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు సైతం ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కంటే ప్రయివేటు, కార్పొరేట్ స్కూళ్లలోనే పుస్తకాల బరువు అధికంగా ఉంటుంది. క్లాస్, ఫెయిర్ వర్క్ కోసం ప్రత్యేకంగా వేరువేరు నోట్ బుక్కులు ప్రతిరోజూ తెప్పిస్తున్నారు. ఇంటికి తీసుకెళ్లాల్సిన అవసరం లేని పుస్తకాలు, నోట్‌బుక్కులను భద్ర పర్చుకునేందుకు తరగతి గదుల్లో అల్మారాలు, ర్యాక్‌లను ఏర్పాటు చేస్తే విద్యార్థులకు ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. కానీ ఏ ఒక్క పాఠశాలలోనూ ఈ ఏర్పాట్లు లేవు. కొన్ని పాఠశాలలు బహుళ అంతస్తుల భవనాల్లో ఉండటంతో మోత బరువుతో మెట్లు ఎక్కుతున్న విద్యార్థులు వెన్ను, మోకాళ్ల నొప్పులతో సతమతం అవుతున్నారు. శక్తికి మించి బరువు మోయడంతో వారి ఎదుగుదలపై కూడా ప్రభావం పడుతోంది.



వెన్నుపూస, మోకాళ్లపై ప్రభావం

పిల్లలపై పుస్తకాల భారం ఇటీవల కాలంలో ఎక్కువయ్యింది. దీనివల్ల వెన్నుపూసపై ప్రభావం పడుతుంది. మెడపై నుంచి మెదడుకు వెళ్లే నరాలపై ఒత్తిడి పెరుగుతుంది. తద్వారా ఎక్కువగా నడవలేక తీవ్రంగా అలసట చెందుతారు. నీరసంగా ఉండి చదువుపై మనస్సును కేంద్రీకరించలేకపోతారు. మోకాళ్ళ నొప్పులు ఎక్కువై ఇతర ఆరోగ్య సమస్యలు పెరుగుతాయి.

- డాక్టర్ మొగలి కాశీ విశ్వనాథం
ఆర్థోపెడిక్ సర్జన్, కాకినాడ.

బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు డిమాండ్

ప్రజాశక్తి-అమలాపురం


మాట్లాడుతున్న కారెం వెంకటేశ్వరరావు

గత నెల పి.గన్నవరం మండలం ఊడిమూడి గ్రామం వద్ద జరిగినటువంటి ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలను ప్రభుత్వం అన్ని విధాల ఆదుకోవాలని ప్రతి కుటుంబానికి రూ.25 లక్షలు ఇవ్వాలని ఎక్స్‌గ్రేషియా సిపిఎం జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గత నెల గన్నవరంలో జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కుటుంబాలకు నేటికీ ప్రభుత్వం నుంచి ఏ విధమైన ఆర్థిక సహకారం అందలేదని తక్షణం ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబాల్ని ఆదుకునేందుకు ప్రభుత్వం తక్షణమే చర్యలు చేపట్టాలన్నారు. యాక్సిడెంట్ జరిగిన కాలం ఎన్నికల కోడ్ ఉండని నూతన ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుంటుందని గతంలో ఉన్నతా ధికారులు చెప్పారు అన్నారు. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయిందని కానీ ఏ విధమైన టువంటి ఆ కుటుంబాలకి ఆర్థిక సహా కారంగాని ఇతర సదు పాయాలు గాని ప్రభుత్వం నుంచి అందించలేదని తక్షణమే చనిపోయిన కుటుంబాలకి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ఇవ్వాలని ఆయన ప్రభుత్వం డిమాండ్ చేశారు. అలాగే ఆర్‌టిసి యాజమాన్యం ఆర్‌టిసి ఉద్యోగులపైన కార్మికుల పైన విపరీతమైనటువంటి పని భారాన్ని మోపుతున్నారని ఈ నేపథ్యంలోనే ఊడిమూడి యాక్సిడెంట్ జరిగిం దన్నారు. భవిష్యత్తులో ఇటువంటి యాక్సిడెంట్లు జరగకుండా ఆర్‌టిసి యాజమాన్యం ఉద్యోగుల పైనా, కార్మికుల పైనా పని భారాన్ని తగ్గించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు శంకర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యపై అధికారుల స్పందన

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరం మండలంలోని పాతకోట గ్రామంలో మంచినీటి చెరువు ఎండగట్టడంతో తాగునీటి సమస్య ఉత్పన్నమైంది. దీనిపై 'ప్రజాశక్తి' దినపత్రికలో పాతకోటలో తాగునీటి సమస్య శీర్షికన శనివారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి నందమూరి శ్రీనివాస, ఇన్చార్జి గ్రామ కార్యదర్శి శీతంశెట్టి సుబ్బారావులు చెరువును పరిశీలించారు. వెంటనే చెరువుకు గోదావరి జలాలను మళ్లించారు. శనివారం రాత్రికి చెరువు పూర్తిగా నిండుతుందని ఫిల్టర్ బెడ్లను ఇప్పటి కే శుభ్రం చేసి ఉంచామన్నారు. దీంతో స్వచ్ఛమైన తాగునీరు సరఫరా అందించేందుకు ఏర్పాట్లు చేశామని గ్రామ కార్యదర్శి 'ప్రజా శక్తి'కి వివరించారు. దీంతో పాటుగా స్వచ్ఛమైన తెల్లని నీటిని కుళాయిలకు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకున్నామని వారు వివరించారు. సమస్యను పత్రికల్లో ప్రచురించి అధికారుల దృష్టికి తీసుకువెళ్లి సమ స్యను పరిష్కరించిన 'ప్రజాశక్తి'కి గ్రామస్తులు, ఫిర్యాదుదారుడు కోటిపల్లి వెంకట సుబ్రహ్మణ్యం కృతజ్ఞతలు తెలిపారు.


చెరువును పరిశీలిస్తున్న అధికారులు

తాగునీటి సమస్యపై ఆందోళన

ప్రజాశక్తి-రామచంద్రపురం

కె.గంగవరంలో గల దళితవాడలో తాగునీటి సమస్యను పరిష్కరించాలని న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో శనివారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. అఖిల భారత రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు వి.భీమ శంకరం మాట్లాడుతూ కె. గంగవరం గ్రామపంచాయతీ పరిధిలో తాగునీటి సమస్య వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. దీనిపై గ్రామ కార్యదర్శి వంటి కి వినతి పత్రం అందించారు. జల్ జీవన్ మిషన్ ను రూ.కోటి 20 లక్షలతో ఏర్పాటు చేస్తున్నామని దీనిద్వారా ఒక ట్యాంకు ఏర్పాటు చేసి 60 వేల లీటర్ల నీటిని ప్రజ లకు అందిస్తామని అన్నారు. కార్యక్రమంలో పిడిఎస్‌యు నాయకులు బి.సిద్ధు, ఐఎఫ్‌టియు నాయకులు చింతా రాజా రెడ్డి, ఎఐకెఎంఎస్ నాయకులు పాల్గొన్నారు.

చింతపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో గ్రాడ్యుయేషన్ డే

ప్రజాశక్తి-రాజోలు

చింతపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గ్రాడ్యుయేషన్ డే ను ఘనంగా నిర్వహిం చారు. ఈకార్యక్రమానికి గ్రామ సర్పంచ్ మట్టా ప్రసన్న కుమారి సురేష్, వైస్ ఎంపిపి ఇంటిపల్లి ఆనంద రాజు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఐసిడిఎస్ సిడిపిఒ వైడికె. రమాదేవి మాట్లాడుతూ బాలల సంరక్షణ చట్టాలు పటిష్టంగా అమలు చేస్తున్నామని అన్నారు. వారికి పౌష్టికాహారం అందించేందుకు చర్యలు తీసుకుంతున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు బాల త్రిపుర సుందరి,ప్రసన్న రాణి, అంగన్‌వాడీ కార్యకర్తలు, వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.


విలేకరులతో మాట్లాడుతున్న రమణారావు

వైసిపి కేంద్ర కార్యాలయం కూల్చడం దుర్మార్గపు చర్య

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

తాడేపల్లిలో ఉన్న వైసిపి కేంద్ర కార్యాలయ భవనాన్ని టిడిపి ప్రభుత్వం దౌర్జన్యంగా కూల్చడం దుర్మార్గపు చర్య అని అమలాపురం నియోజకవర్గం వైసిపి సీనియర్ నాయకుడు, గుడ్ సీడ్ ఫౌండేషన్ ఫౌండర్ కుంచే రమణారావు అన్నారు. చల్లపల్లి పంచాయతీ జగ్గరాజుపేటలో శనివారం రమణారావు స్వగృహం వద్ద విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డారు. నిర్మాణంలో ఉన్న పార్టీ కార్యాలయ భవనాన్ని సిఆర్‌డిఎ అధికారులు అన్యాయంగా కూల్చి వేయడం తగదన్నారు. నిర్మాణంలో ఉన్న ఈ భవనాన్ని కూల్చివేయాలన్న ఉత్తర్వులను సవాల్ చేస్తూ వైసిపి అధిష్టానం హైకోర్టును ఆశ్రయించిన సమయంలో చట్టాన్ని అతిక్రమి ంచి వ్యవహరించవద్దని హైకోర్టు సూచించి నప్పటికీ దౌర్జన్యంగా మున్సిపల్ అధికారులతో సిఆర్‌డిఎ కూల్చివేయడం అన్యాయంమని అన్నారు. ఈ దుశ్చర్యకు చంద్రబాబు కూటమి ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరి స్తోంద న్నారు. కనీసం నోటీసులు కూడా ఇవ్వకుండా భవనాన్ని కూల్చడం చట్టాన్ని తమ చేతుల్లో పెట్టుకున్నట్టు అయిందన్నారు. కూటమి ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా చట్ట వ్యతిరేక విధానాలను ప్రజలు గమని స్తున్నా రని ప్రజలు తిరగబడి బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని రమణారావు అన్నారు.

డయేరియా నిర్మూలనపై అవగాహన కల్పించాలి

ప్రజాశక్తి-అమలాపురం

అతిసారం నిర్మూలన కోసం తీసుకోవాల్సిన చర్యలపై ప్రజలకు అధికారులు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా పేర్కొన్నారు. నివారం అమలాపురం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ఫోర్ట్ నైట్ క్యాంపెయిన్ మీద జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... చిన్నపిల్లలలో అతి సారాన్ని నిర్మూలించుటకు జింక్ మరియు ఒఆర్ఎస్ ప్యాకెట్ల వినియోగాన్ని పెంచడం తదితర అంశాలపై అధికారులు కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఇంటెన్సిఫైడ్ డయేరియా కంట్రోల్ ఫోర్ట్ నైట్ క్యాంపెయిన్ జులై 1 నుంచి 31 ఆగస్టు వరకు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భాగంగా శాఖల వారీగా ఆయా శాఖలు ప్రతివారం తీసుకోవలసిన చర్యలను సంబంధిత అధికారులకు వివరించారు. ఒఆర్ఎస్ మరియు జింక్ ప్యాకెట్లను అన్ని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రయిమరీ హెల్త్ కేంద్రాలలో అందుబాటులో ఉంచాలన్నారు. ఆశ వర్కర్ల ద్వారా ఒఆర్ఎస్ మరియు జింక్ వినియోగించడంపై ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలనీ జిల్లా వైద్యాధికారులను ఆదేశించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సహాయంతో అన్ని అంగన్‌వాడీ కేంద్రాల వద్ద ఒఆర్ఎస్ మరియు జింక్ ప్యాకెట్లు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ వర్కర్లకు చిన్న పిల్లల్లో ఎదుగుదల మరియు న్యూట్రిషన్ను మానిటరింగ్ చేసేందుకు ప్రత్యేకంగా ట్రయినింగ్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పిడిఐసిడిఎస్‌కు సూచించారు. అంగన్‌వాడీ సెంటర్లు స్కూలు, హెల్త్ కేర్ కేంద్రాలు కమ్యూనిటీ కేంద్రాలలో నీటి నాణ్యతను పరీక్షించి తగిన చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలలో మరియు పట్టణాలలో పారిశుధ్యం సరిగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీ అధికారులు మరియు మున్సిపల్ కమిషనర్లను ఆదేశించారు. పాఠశాలలలో చేతులు సరిగ్గా శుభ్రపరచుకోవడం, సరైన భోజనాలవాట్లు ,పరిశుభ్రత తదితర అంశాల మీద విద్యార్థులకు అవగాహన కల్పించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారులకు సూచించారు. ప్రతి ఇంటికి పరిశు భ్రమైన త్రాగునీరు అందించేలా సంబంధిత అధికారులు అందరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. అనంతరం కలెక్టర్ జిల్లాలోని ఎంపిడిఒలు మున్సిపల్ కమిషనర్లు సిడిపిఓలు మెడికల్ ఆఫీసర్లు తదితర మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అతిసారం నివారణ మరియు నిర్వహణ అంశంపై సమీక్షించారు. మండల స్థాయి అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ... జిల్లాలోని ప్రజలందరికీ సురక్షిత త్రాగునీటిని అందించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2023 జూలై నెల నుంచి 2024 జూలై మొదటి వారం వరకు జిల్లాలో 0 నుంచి 5 సంవత్సరాల వయసు కలిగిన 358 మంది పిల్లలు అతి సారానికి (డయేరియా) కి గురైనట్లు అధికారిక డేటా చెబుతున్నట్లు పేర్కొన్నారు. అత్యధికంగా ఉప్పలగుప్తం మండలంలో 30 కేసులు నమోదయ్యా అన్నారు. జిల్లాలో ప్రజలకు అందిస్తున్న తాగునీరు మూడు దశలలో కలుషితానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. సిపిడబ్ల్యూఎస్ /పిడబ్ల్యూఎస్ స్కీములు సరిగా పనిచేయకపోవడం, ఓవర్ హెడ్ ట్యాంకులను సరిగా శుభ్రపరచకపోవడం మరియు వాటర్ క్లోరినేషన్ చేయకపోవడం, ఓవర్ హెడ్ ట్యాంకుల నుంచి గృహాలకు నీరు సరఫరా చేసే తాగునీటి పైపుల లో లీకేజీ నీరు కలుషితం అవడం ప్రధాన కారణాలు అన్నారు. సంబంధిత మండలాల ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు నీరు ఏ దశలో కలుషితమవుతుందో గుర్తించి తగిన చర్యలు తీసు కోవడం ద్వారా నీటి సంబంధిత వ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో జెసి నుపూర్ అజయ్, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వెంక టేశ్వర్లు, పీడీ ఐసిడిఎస్ ఎం.ఝాన్సీ, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి దుర్గారావు దొర, జిల్లా ఇమ్యూనై జేషన్ అధికారి బి.సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి రాంబాబు, ఆర్‌డబ్ల్యూ ఎస్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సురేష్ కుమార్, మండలాల నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎంపిడిఒలు, మెడికల్ ఆఫీసర్లు, మున్సిపల్ కమిషనర్లు పాల్గొన్నారు.

'నేను బడికి పోతా'పై అవగాహనా ర్యాలీ

ప్రజాశక్తి-మామిడికుదురు

మామిడికుదురు మండల విద్యా వనరుల కేంద్రం వద్ద "నేను బడికి పోతా' కార్యక్రమంలపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంపిడిఒ ఎస్.వేణుగోపాల్ రెడ్డి బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని పిలుపు నిచ్చారు. మండలం లో 60 ఆవాస ప్రాంతాలలో బడి బయట పిల్లలను బడిలో చేర్చేందుకు ఈ నెల 15 నుంచి జులై 12 వరకు జరుగుచున్న 'నేను బడికి పోతా', ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌లో భాగంగా మండల కమిటీ ఆధ్వర్యంలో ఎన్యుమెరేటర్లకు సమీక్ష కార్యక్రమం మరియు అవగాహనా ర్యాలీ నిర్వహిం చారు. కార్యాక్రమంలో తహశీల్దార్ ఎం.మెరికమ్మ, ఎంపిడిఒ ఆఫీస్ ఎఒ కె.వెంకటేశ్వరరావు, ఎంఇఒ లక్ష్మీనారాయణ, ఎంఇఒ-2 ఎం.వెంకన్నబాబు, మామిడికుదురు హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు సిహెచ్.నిరంజని, సోషల్ వెల్ఫేర్ హాస్టల్ వార్డెన్స్ కె.ప్రవీణ్ కుమార్, పివిఎస్.నాగవేణి మరియు పార్ట్ టైం ఇనస్ట్రకర్స్, సిఆర్‌ఎంటిలు, ఎంఇఒ ఆఫీసు సిబ్బంది పాల్గొన్నారు. **ఆలమూరు:** జూలై 12 వరకు బడి బయట పిల్లలను బడిలో చేర్చేందుకు ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కోసం చర్యలు చేపట్టినట్లు జిల్లా అధికారులు ఎఎల్ఎస్సి కోఆర్డినేటర్ రమేష్, ఎంఇఒ రాంబాబు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో విద్య వనరుల కమిటీ ఆధ్వర్యంలో మండలంలోని 42 ఆవాస ప్రాంతాల్లో నిర్వహిస్తున్న "నేను బడికి పోతా' కార్యక్రమంలో భాగంగా ఎన్యూమరేటర్లకు సమీక్ష సమావేశం జరిపి, అవగాహనా కల్పించి, ర్యాలీ నిర్వహించారు. కార్యాక్రమంలో తహశీల్దార్ అనిల్ కుమార్, ఎంపిడిఒ ఎ.మేరీ రోజ్, ఎంఇఒలు షాలెం రాజు, సుబ్బరాజు తదితరులు పాల్గొన్నారు.



మామిడికుదురులో నిర్వహించిన ర్యాలీలో పాల్గొన్న అధికారులు తదితరులు

బాలబాలాజీ నిత్యాన్నదానానికి విరాళం

ప్రజాశక్తి-మామిడికుదురు

అప్పనపల్లి శ్రీ బాలబాలాజీ శాశ్వత నిత్యాన్నదాన ట్రస్ట్‌కు దాత విరాళం అందజేశారు. ఏలూరు జిల్లా కైకలూరుకు చెందిన పెనుమత్స మణికంఠ కష్ణం రాజు, స్వాతి దంపతులు కుమారుడు క్రిటిన్ వేదాంట్ వర్మ పుట్టిన రోజు ప్రతి ఏటా డిసెంబర్1న అన్నదానము జరిపించు నిమిత్తం రూ.10,000 విరాళంగా ఇచ్చారని ఆలయ సహాయ కమిషనర్ గ్రంధి మాధవి తెలిపారు. దాత దంపతులకు స్వామివారి చిత్రపటం, లడ్డు ప్రసాదంలు అందజేశారన్నారు

స్వామి వారి ఆదాయం రూ.2.99లక్షలు

దేవస్థానం నందు శనివారం లడ్డు ప్రసాదం విక్రయం, దర్శనము టిక్కెట్లు విక్రయం ద్వారా రూ.2,99,163 ఆదాయం వచ్చిందిని ఆలయ సహాయ కమిషన్ తెలిపారు.

తాగునీటి పథకాన్ని పరిశీలించిన డిఎల్‌పిఒ

ప్రజాశక్తి-అమలాపురం (అల్లవరం)

అల్లవరం మండలం బోడసకుర్రు గ్రామపంచాయతీ పరిధిలో సిపిడబ్ల్యూఎస్ రక్షిత మంచినీటి పథకం, మంచినీటి చెరువును డిఎల్పిఒ బొజ్జి రాజు, ఎంపిడిఓ కృష్ణ మోహన్ , గ్రామ సర్పంచ్‌రొక్కాల విజయలక్ష్మి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా వాటర్ ప్రాజెక్టు నిర్వహణ ను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్య క్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ స్వామి, ఇఒపిఆర్‌డి ఎన్‌వివి. సత్య నారాయణ, పంచాయతీ కార్యదర్శి దుర్గాశ్రీను తదితరులు పాల్గొన్నారు.

పేదలకు దుస్తుల పంపిణీ

ప్రజాశక్తి-ఆత్రేయపురం

గణపతి ఆలయంలో ఘనంగా వస్త్ర ప్రదాత దేవల మహర్షి జయంతి శనివారం నిర్వహించారు. అనంతరం శ్యామ్ అడ్వాన్స్ ఫిజియోథెరపీ రిహాబిలిటేషన్ సెంటర్ అధినేత లండన్ డాక్టర్ మోహిత్ సౌజన్యంతో ర్యాలి సందర్శకులకు ఉచిత అల్పాహారాన్ని ఏర్పాటు చేశారు. దీంతో పాటు ఆత్రేయపురం రావులపాలెం మండలాల్లో, గుడారాలలో నివసిస్తున్న పేదలకు వస్త్ర దానం చేశారు.


పల్లా శ్రీనివాసరావును కలసిన అంబాజీపేట టిడిపి శ్రేణులు

టిడిపి రాష్ట్ర అధ్యక్షునికి సత్కారం

ప్రజాశక్తి-అంబాజీపేట

రాష్ట్ర టిడిపి అధ్యక్షులు, విశాఖ ఎంఎల్ఎ పల్లా శ్రీనివాసరావు అంబాజీపేట టిడిపి శ్రేణులు శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. టిడిపి జిల్లా బిసి సెల్ నాయకులు బొంతు పెదబాబు, గణపతి వీర రాఘవులు, రావణం రాము తదితరులు శ్రీనివాసరావును శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యకర్తల శ్రేయస్సుకు మరింతగా అభివృద్ధి చేస్తానని ఆయన వారికి భరోసా కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపి జనసేన శ్రేణులు పాల్గొన్నారు.

ఉపాధిపనులపై ఎంపిడిఒకు వినతిపత్రం అందజేత

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

తమ గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ చట్టం పనులు రైతులకు ప్రయోజనం చేకూర్చే విధంగా ఉండాలంటూ ఎన్.కొత్తపల్లికి చెందిన రైతులు శనివారం ఎంపిడిఒ కెవి.ప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. సాగునీరు, మురుగునీరు పారేందుకు తమ గ్రామంలో పంట కాలువలు మురుగు బోదె లు సక్రమంగా లేవని ఉపాధి హామీ చట్టంలో అభివృద్ధి చేయాలన్నారు. రైతులు ఈదరపల్లి శ్రీను రాజు,పెన్మత్స వెంకట కృష్ణంరాజు,డాక్టర్ గుత్తుల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మృతురాలి కుటుంబాన్ని పరామర్శించిన జెడ్‌పిటిసి సభ్యుడు సంపదరావు

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం


చిట్టెమ్మ (ఫైల్)

గోపవరానికి చెందిన అయితాబత్తుల చిట్టెమ్మ శుక్రవారం మృతి చెందారు. ఆమె కుమారులు మాజీ సర్పంచ్ అయితాబత్తుల వెంకట కృష్ణారావు, రైతు సంఘం నాయకుడు ఉమామహేశ్వరరావు, పోలీసు ఉద్యోగి బాలకృష్ణ, కుటుంబ సభ్యులను జెడ్‌పిటిసి సభ్యుడు గెడ్డం సంపదరావు, ఎంపిటిసి సభ్యుడు కొంకి ఏడుకొండలు నాయకులు శనివారం పరామర్శించారు. మృతు రాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పరామర్శించిన వారిలో జనసేన నాయకులు ఇసుకపట్ల రఘుబాబు, ఏడిద శ్రీను, సాకా రాంబాబు గ్రామస్తులు ఉన్నారు.

నెలాఖరులోగా నారుమళ్లు పూర్తి చేయాలి

ప్రజాశక్తి-అమలాపురం (అల్లవరం)

ఈ నెలాఖరుపు వరి నారుమడులను పూర్తిచేయాలని జిల్లా వ్యవసాయ అధికారి వి బోసుబాబు అన్నారు. అల్లవరం మండలం కోడూరుపాడు గ్రామంలో వరి నారుమడులను శనివారం ఆయన పరిశీలించారు. బోసుబాబు మాట్లాడుతూ ఈ సార్వా పంట కాలంలో జిల్లా వ్యాప్తంగా 1,68,780 ఎకరాల వరిసాగు లక్ష్యంగా నిర్దేశించామన్నారు ఇప్పటి వరకు 1836 ఎకరాల్లో వరినారుమడులు పూర్తి అయ్యాయని అన్నారు. 593 ఎకరాల్లో వెదజల్లు పద్ధతిలో వరి సాగు, 30 ఎకరాల్లో వరి నాట్లు పూర్తి అయ్యాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి ఎన్‌వివి.సత్యనారాయణ, ఎఇఒ జి.శివమోహన్, వ్యవసాయ సహాయకురాలు శ్రావణి, పాల్గొన్నారు.


ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతుల ధర్నా

ప్రజాశక్తి-ఆలమూరు

ప్రభుత్వ నిబంధనలతో ధాన్యం విక్రయాలకు ఆపసోపాలు పడిన రైతులకు ఇప్పుడు బిల్లులు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ మేరకు శనివారం మోదుకూరులో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద రైతులు ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏప్రిల్ మొదటి వారం నుంచే అధికారులు ధాన్యం కొనుగోలు ప్రారంభించి కొన్ని వేల మెట్రిక్ టన్నులు సేకరించారు. దీనికి సంబంధించి రైతులకు బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. అయితే కేవలం కొంతమంది రైతులకు మాత్రమే ఏప్రిల్ 20 వరకు ఖాతాల్లో జమచేశారు. అప్పటినుంచి ఇంకా మండల వ్యాప్తంగా కొన్ని కోట్ల రూపాయలు పెండింగ్‌లో ఉన్నాయి. తమ ఖాతాల్లో నగదు జమకాకపోవడంతో రాబోయే పంటలకు పెట్టుబడులు ఎలా ఏర్పాటు చేసుకోవాలని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా ఆన్లైన్ పద్ధతులలో ధాన్యం సేకరించడం వలన ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఆర్‌బికె మొదలుకొని సివిల్ సప్లయ్ యంత్రాంగం వరకు సాంకేతిక సమస్యలతో బిల్లుల చెల్లింపు ఆలస్యమవుతోందని రైతులు ఆవేదన చెందారు. ఆర్‌బికెల పరిధిలో సాంకేతిక సిబ్బంది రైతుల పేరిట ఎఫ్‌టీవోలు జనరేట్ చేసినా చెల్లింపులు ప్రక్రియ నత్తనడకన సాగుతుందన్నారు. ఒకవేళ డబ్బులు రైతుల ఖాతాల్లో జమైనా కొన్ని బ్యాంకులు రోజుకి రూ.30వేలు మాత్రమే విత్‌డ్రా చేసుకోవాలనే షరతులతో రైతులు సమస్యలను ఎదుర్కొంటున్నామన్నారు. ప్రభుత్వం స్పందించి ఆర్‌బికెల ద్వారా ధాన్యాన్ని తరలించే పద్ధతిని నిలిపివేసి పాత పద్ధతులలో కనీస మద్దతు ధర లభించే విధంగా అమ్ముకునే ఏర్పాట్లు చేసి, అమ్ముకున్న ధాన్యానికి త్వరగా రుసుమును చెల్లించాలని రైతులు కోరారు.


ఆర్‌బికె వద్ద ధర్నా చేస్తున్న రైతులు

కార్టూ'నిజం'



నేరాలు ఘోరాలు

280 లీటర్ల సారా స్వాధీనం

ప్రజాశక్తి - ఏలేశ్వరం

ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో నిర్వహించిన దాడుల్లో అధికారులు ట్రావెలింగ్ ఆటోలో తరలిస్తున్న 280 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా సిఐ ఎల్.చిరంజీవి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శనివారం ప్రత్తిపాడు ఎక్సైజ్ పరిధిలో మాసంపల్లి గ్రామం వద్ద వాహనాలు తనిఖీ నిర్వహిస్తుండగా ట్రావెలింగ్ ఆటోలో ప్లాస్టిక్ కవర్లతో ప్యాకింగ్ చేసిన 280 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని రవాణా చేస్తున్న గోరకపూడి సురేష్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. నాటు సారా యజమాని వెలుగుల శ్రీను పై కేసు నమోదు చేశామన్నారు. అనంతరం ప్రత్తిపాడు ప్రగతి కాలేజ్‌లో మాదకద్రవ్యాల వినియోగం, నియంత్రణపై అవగాహన సదస్సు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో ఎస్ఐ బి ఎస్‌వి ఎం.ఆశాలత, సిబ్బంది కృష్ణారావు, వీర భద్రరావు, దొరబాబు, రాజు, సరాం ఖాన్ పాల్గొన్నారు.

అనుమానాస్పదంగా యువకుని మృతి

ప్రజాశక్తి - తాళ్లపూడి

తాళ్లపూడిలో ఒక యువకుడు ఫ్యానుకు ఉరేసుకుని అనుమానాస్పదంగా ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆచంట వీరాస్వామి (26) రాజమహేంద్రవరం రూరల్ దివాన్ చెరువు నుంచి తాళ్లపూడి వచ్చి ఒక హోటల్లో కుక్‌గా పని చేస్తున్నాడని ఎస్‌ఐ శ్యామ్‌సుందర్ తెలిపారు. అతడు ఉంటున్న ఇంటి నుంచి దుర్వాసన వస్తోందని ప్రజలు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు పరిశీలించారు. వీరాస్వామి మృతదేహం ఫ్యానుకు వేలాడుతూ కనిపించింది. దీనిపై అనుమానాస్పద మరణంగా కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

ద్వారకాతిరుమలకు కాలినడకన దొరాజీ

ప్రజాశక్తి-నల్లజర్ల

ఇటీవల ఎన్నికల్లో టిడిపి అభ్యర్థి మద్దిపాటి వెంకటరాజు గెలిస్తే దుద్దుకూరు నుంచి ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయానికి కాలినడకన వస్తానని టిడిపి దేవరపల్లి మండల సీనియర్ నాయకులు ముళ్ళపూడి దొరాజీ చౌదరి మొక్కుకున్నారు. దీంతో శనివారం దొరాజీ పుట్టినరోజు సందర్భంగా దుద్దుకూరు నుండి దేవరపల్లి నల్లజర్ల మీదుగా ద్వారకాతిరుమలకు పార్టీ నాయకులు బంధువులు అనుచరులతో కలిసి ఆయన భారీ సంఖ్యలో కాలినడకన బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యంలో అనంతపల్లిలో మాజీ మండల అధ్యక్షులు జమ్ముల వీర వెంకట సతీష్ ఆధ్వర్యంలో అచ్చన్నపాలెంలో సీనియర్ నాయకులు పాతూరి ఆదినారాయణ, పాతూరి రమేష్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. నల్లజర్లలో ఎలమాటి శ్రీనివాసరావు కండెపు వెంకటరత్నం. ఆధ్వర్యంలో దొరాజీ పుట్టినరోజు సందర్భంగా ఏర్పాటు చేసిన కేక్‌ను ఆయన కట్ చేశారు. ఈ యాత్రలో ఆండ్రు అనిల్, షేక్ మీరాసాహెబ్ తదితరులు ఉన్నారు.

తాగునీరు, పారిశుధ్యంపై సమీక్ష

ప్రజాశక్తి-చాగల్లు

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ నాతి బుజ్జి, విస్తరణాధికారి ఆర్.శ్రావణ్ కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ టి.మనోజ్ అధ్యక్షతన తాగునీటి నిర్వహణ, శానిటేషన్, సీజనల్ వ్యాధులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రస్తుత వాతావరణ కారణాల వల్ల వర్షాకాలంలో మురుగు నీరు రోడ్లపైన, డ్రైనేజీల్లో నిల్వఉండకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పంచాయితీల పరిధిలోని తాగునీరు వాటర్ ట్యాంక్‌లను శుభ్రం చేయాలని సూచించారు.



హెచ్‌ఎంకు నగదును అందిస్తున్న డాక్టర్ మోహన్‌బాబు

పాఠశాలకు రూ.ఐదు వేల విరాళం

ప్రజాశక్తి - కరప

మండలంలోని గురజానపల్లి ఆయుష్ వైద్యశాల డాక్టర్ మోహన్‌బాబు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.5000 విరాళం ఇచ్చినట్లు హెచ్‌ఎం ఎ.సాయిమోహం తెలిపారు. స్థానిక హైస్కూల్‌కు క్రీడా సామగ్రి నిమిత్తం ఈ విరాళాన్ని యోగా దినోత్సవం పురస్కరించుకుని అందించారు. ఆయూష్ వైద్య సిబ్బంది, ఇతర యోగా నిపుణులు పెంకె.లోవరాజు, బాబూజి, కృష్ణమూర్తి ఆధ్వర్యంలో వివిధ ఆసనాలు, ధ్యానం, యోగా ప్రాముఖ్యత వివరించారు. మోహన్ బాబుకు హెచ్ ఎం, ఇతర ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

ధరల జోరు... సామాన్యుల బేజారు

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి

పెరిగిన నిత్యావసర సరుకుల ధరల జోరు సామాన్యులను ఆందోళనకు గురి చేస్తోంది. ఓవైపు కూరగాయల ధరలు వారం రోజులుగా నింగిని తాకుతున్నాయి. కిలో టమోటాలు రూ.100కు చేరింది. ఉల్లి ధరలు సైతం రూ.45కు చేరాయి. ఏ కూరగాయలైనా కేజీ రూ.50 పైమాటే. ఆకు కూరలు సైతం ఆకాశాన్నంటుతున్నాయి. అల్లం కేజీ రూ.300కి చేరింది. వెల్లుల్లి పాయలు అల్లంతో పోటీపడుతున్నాయి. మరో వైపు బియ్యం ధరలు ఇప్పటికే పెరిగి ప్రజలకు కంటిమీద కునుకులేకుండా చేస్తున్నాయి. బియ్యం ధరల పెంపునకు కేంద్ర ప్రభుత్వ అనుసరిస్తున్న జీఎస్‌టి కారణమని వ్యాపారులు చెబుతున్నారు. ఆదాయానికిమించి నిత్యావసర ఖర్చులు పెరగడం ఆందోళనకు గురి చేస్తోంది. కొత్త ప్రభుత్వమైన ధరల నియంత్రణ కోసం చర్యలు తీసుకుంటారనే ఆశాభావం వ్యక్తమవుతోంది. అయితే పాలకులు ఏ మేరకు చిత్తశుద్ధితో వ్యవహరిస్తారో వేచి చూడాల్సి ఉంది.

చుట్టుముడుతున్న సీజనల్ వ్యాధులు

జిల్లా ప్రజలను సీజనల్ వ్యాధులు చుట్టుముట్టడంతో అనారోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. గడిచిన వారం రోజులుగా ఎండ తీవ్రత కొనసాగుతుంది. అప్పుడప్పుడు కురుస్తున్న వర్షాలతో సీజనల్ వ్యాధులు చుట్టుముడుతున్నాయి. ఈ నేపథ్యంలో జిల్లాలో జ్వర పీడితుల సంఖ్య రోజురోజుకీ పెరుగుతోంది. ప్రభుత్వ ప్రయివేట్ ఆస్పత్రులలో ఓపీల్ రోగుల సంఖ్య గణనీయంగా పెరుగుతోంది. ప్రభుత్వ ఆస్పత్రులలో బెడ్ టెస్ట్‌ల మొదలుకుని వివిధ రకాల పరీక్షలు, మందులు ప్రభుత్వ ఆస్పత్రులలో లభించడం లేదు. అత్యధిక మందిని జిల్లాలో ప్రధాన ఆస్పత్రులైన రాజమహేంద్రవరం, కాకినాడకు రిఫర్ చేస్తున్నారు. దీంతో రోగులు వెనకడుగు వేస్తున్నారు. తప్పనిసరి పరిస్థితులలో తమ గ్రామాల్లోనే ఆర్‌ఎంపీలు, ఇతర ప్రయివేట్ ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. ప్రభుత్వ ఆస్పత్రులలో వైద్య సౌకర్యాలు కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ వైద్యరంగాన్ని మరింత బలోపేతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

కాల్వల ఆధునీకరణకు అడుగులు పడేనా..?

గోదావరి గలగలలు

ఖరీఫ్ సాగును నీటిగండం వెంటాడుతోంది. గోదావరి నదీ పరివాహక ప్రాంతం కావటంతో జిల్లాలో అత్యధిక ప్రాంతాలలో నీటి వనరులు పుష్కలంగా ఉన్న విషయం విదితమే. పోలవరం పూర్తి చేస్తామంటూ గత ప్రభుత్వం పలు మార్లు వాయిదాలు వేసింది. నూతన ప్రభుత్వం సైతం పోలవరం పూర్తి చేయటంపై స్పష్టత ఇవ్వలేదు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ప్రతి ఏటా నిర్వహించే వేసవి పనులు అటకెక్కటంతో సాగు ప్రశ్నార్థకంగా మారింది. కాల్వల ఆధునీకరణ, తూడు కాడ తొలగింపు, గోదావరి డ్రెడ్జింగ్ నిర్వహించటం దశాబ్దాల కాలంగా ఆనయవాయితీగా వస్తోంది. తాజాగా శివారు పొలాలకు నీరందటం లేదు. మరోవైపు భారీ వర్షాలు కురిస్తే డ్రెయిన్లు పూడిక తీత లేకపోవటంతో పంటలు మునిగిపోయే ప్రమాదం పొంచివుంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం స్పందించి కాల్వల ఆధునీకరణ చేపట్టాలని రైతాంగం కోరుతున్నారు.

ఎడా పెడా ఛార్జీల మోత మోగిస్తున్న ప్రభుత్వం వినియోగదారులకు విద్యుత్ సరఫరాపై దృష్టి సారించకపోవడంతో ఓ వైపు ఉక్కపోత... మరోవైపు ఎండ వేడిమితో ప్రజలు అవస్థలు తప్పటం లేదు. గడిచిన వారం రోజులుగా సూర్యుడు నిప్పులు చెరుగుతున్నాడు. ఉదయం 9 గంటల నుంచే భానుడు తన ప్రతాపం చూపిస్తున్నాడు. ఇళ్లలో, ఆఫీసులలో ఏసీలు, ఫ్రిజ్‌ల వినియోగం ఒక్కసారిగా పెరిగింది. దీంతో విద్యుత్ డిమాండ్ రోజుకు 19 వేల యూనిట్ల నుంచి 21 వేల యూనిట్లకు చేరింది. ఫలితంగా విద్యుత్ అంతరాయాలు పరిపాటిగా మారాయి. తొలుత పల్లెలకే పరిమితమైన విద్యుత్ అంతరాయాలు ప్రస్తుతం పట్టణాలల్లోనూ పరిపాటిగా మారాయి. డిమాండ్ తగ్గట్లుగా సరఫరా చేసే అవకాశాలు తక్కువగా కన్పిస్తున్నాయి. ప్రభుత్వం చొరవ తీసుకుని డిమాండ్‌కు తగ్గట్లుగా సరఫరా చేసేట్లుగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జర్నలిస్టు సుదర్శన్‌కు ఘన నివాళి

ప్రజాశక్తి - కాజులూరు



బాధిత కుటుంబానికి చెక్కును అందిస్తున్న యూనియన్ నాయకులు

ఇటీవల గుండె పోటుతో మరణించిన జర్నలిస్టు సుదర్శన్‌కు పలువురు ఘనంగా నివాళులర్పించారు. శనివారం కాజులూరు మండలం చేదువాడ గ్రామంలో సుదర్శన్ ఇంటివద్ద పెద్ద కార్యక్రమాన్ని కుటుంబ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుదర్శన్ కుటుంబ సభ్యులకు ఎపిడబ్ల్యూజెఎఫ్ కాకినాడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాతాడ నవీన్‌రాజ్, ముమ్మిడి లక్ష్మన్ యూనియన్ పక్షాన రూ.10 వేలను అందించారు. కుటుంబ సభ్యులకు ఎప్పుడూ అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పుర్రె త్రినాథ్, పాలిక శ్రీనివాస్, బాబీ, ఖండేపల్లి వెంకట సత్యనారాయణ, మల్లేశ్వరరావు జిల్లా కౌలు రైతుల సంఘం కార్యదర్శి వల్లు రాజబాబు, వ్యవసాయ కార్మిక సంఘ అధ్యక్షులు టేకుమూడి ఈశ్వరరావు, రామచంద్రపురం రూరల్, రామచంద్రపురం, కె.గంగవరం, కాజులూరు మండలాలకు చెందిన పలువురు సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, జర్నలిస్టులు పాల్గొన్నారు.

ధరల నియంత్రణకు చర్యలు : జెసి

ప్రజాశక్తి - కాకినాడ



అధికారులతో సమీక్షిస్తున్న జాయింట్ కలెక్టర్

జిల్లాలో కూరగాయలు, ఇతర నిత్యావసర వస్తువులు ధరల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ లోధరల పర్యవేక్షణ కమిటితో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూరగాయలు, నిత్యావసర వస్తువులు ధరలు పెరగుతూ ఉండడంతో వెంటనే ధరలు తగ్గుదలకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. సరుకులు, కూరగాయలను అక్రమంగా నిల్వ చేసి కృత్రిమ కొరతను సృష్టిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కూరగాయలు, నిత్యావసర వస్తువుల వర్తక సంఘాలకు తెలియజేయాలన్నారు. రైతు బజారులో నిర్దేశించిన ధరలు కంటే అధికంగా ఎవరైనా అమ్మకాలు జరిపితే తక్షణమే వారి అనుమతులు రద్దు చేసి, వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ వాణిజ్య, మార్కెటింగ్ అధికారి కెఆర్‌ఆర్.నాగేశ్వరరావు, పౌర సరఫరాల మేనేజర్ ఎం.బాలసరస్వతి, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎంవి.ప్రసాద్, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎన్.మల్లికార్జునరావు, కాకినాడ నగరంలోని రైతుబజార్ల ఎస్టేట్ అధికారులు, హోల్‌సేల్ కూరగాయల మార్కెట్, కాకినాడ వ్యాపారుల ప్రతినిధులు, ఎడిబుల్ ఆయిల్స్ మర్చంట్స్ అసోసియేషన్, రైస్ మిల్లర్స్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పూడికతీత పనులు

ప్రజాశక్తి - కరప



జెసిబితో పూడికను తొలగిస్తున్న దృశ్యం

మండలంలోని పెనుగుదురు కెఎంజి కెనాల్ పాతర్లగడ్డ కర్రవంతెన, గొర్రిపూడి. కరపలో వెంకటప్పయ్య మురికి కాలువలో కరప, జడ్ భావారం, కోరుపల్లి, పేపకాయల పాలెం, పాతర్లగడ్డ, పెనుగుదురు, గొర్రిపూడి గ్రామాల్లో పూడిక తీత పనులు కొనసాగుతున్నాయి. ఎంఎల్ఎ పంతం నానాజీ సొంత ఖర్చులతో జరుగుతున్న పూడికతీత పనులు శనివారం జరిగాయి. మండలంలో ఏ రాజకీయ నాయకుడు తన సొంత ఖర్చులతో చేయలేని పనిని నానాజీ చేయడం పట్ల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పూడికతీత పనులు జరుగుతున్న ప్రాంతాలను జనసేన నాయకులు బండారు లక్ష్మీప్రసాద్, గంట నానిబాబు, సైనవరాపు భవానీశంకర్, పేపకాయల అంజి, హరనాథ్, మల్లిబాబు, చిన్నారి శ్రీనివాస్ తదితరులు పర్యవేక్షించారు.

చట్టాలు, హక్కులపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి - కోటనందూరు



సదస్సులో మాట్లాడుతున్న సిఐ గీతా రామకృష్ణ

తుని మండల న్యాయ సేవ అధికార సంఘం ఆధ్వర్యంలో మహిళల హక్కులు, చట్టాలపై శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐ ఎం.గీతా రామకృష్ణ. తుని బార్ అసోసియేషన్ అధ్యక్షులు సలుగు కృష్ణశేఖర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ మహిళల రక్షణ చట్టాలను హక్కులను పోలీసులు, న్యాయస్థానాలకు కాపాడుతూనే ఉంటాయని అన్నారు. కొంతమంది మహిళలు అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడుతూ వారి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని అన్నారు. మహిళల అభివృద్ధి కొరకు ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతుందని, వాటిని మహిళలు సద్వినియోగ పరచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో స్వాతి, ఉదయ రేఖ మహిళా మహిళా సంఘాలు, నాసా స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి సిహెచ్ జ్యోతి ప్రేమదాసు, పలు ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు .

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక



నాటి ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - సామర్లకోట

ఒకే బడిలో ఓనమాలు దిద్దుకుని గురు వుల వద్ద అక్షర జ్ఞానాన్ని పొంది జీవన ప్రయాణం సాగించిన స్నేహితులంతా 50 ఏళ్ల విరామం తరువాత కలుసుకున్న అపూర్వ కలయిక శనివారం చోటు చేసుకుంది. తమకు విద్యా బుద్ధులు నేర్పిన నాటి గురువులను వినమ్రపూర్వకంగా సత్కరించుకుని గత స్మృతులను నెమరు వేసుకున్నారు. శనివారం సామర్లకోట మునిసిపల్ హైస్కూలు విద్యార్థుల స్వర్ణోత్సవ వేడుకలు సామర్లకోట ఎస్‌ఆర్ గ్రాండ్ పార్క్‌లో ఘనంగా నిర్వహించారు. సామర్లకోట అయోధ్యరామపురం మునిసిపల్ హైస్కూల్లో 1972-73 సంవత్సరంలో 10వ తరగతి చదువుకుని ఎక్కడెక్కడో స్థిరపడిన నాటి విద్యార్థులు సుమారు 50 మంది ఈ స్వర్ణోత్సవ వేడుకలకు సామర్లకోట వచ్చారు. ఈ సందర్భంగా వారు ఆనాటి సంగతులను నెమరు వేసుకున్నారు. తమకు విద్యాబోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ 50 సంవత్సరాల క్రితం తాము 10వ తరగతి వరకు మునిసిపల్ హైస్కూలు చదువుకున్నామని అప్పటి మధురస్మృతులు, తీపి సంఘటనలు గుర్తుకు వస్తున్నాయన్నారు. విద్యా బోధన చేసిన గురువులకు భక్తితో సన్మానించారు. ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకు ఎంతో కృషి చేసిన తమ తోటి మిత్రులు డాక్టర్ వేల్పుల సత్యనారాయణ, వేల్పుల అప్పారావు, ఎస్‌వి. రమేష్‌బాబు, గాలి కేశవరావు, నేతి చక్రధరరావు, పేరి బాలకృష్ణ, కట్టా బాబూరావు, బివి.రాఘవలు, బివి.సుబ్బారావు, పుట్ట వెంకటరమణ, తదితరులకు పూర్వ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తత అవసరం

ప్రజాశక్తి - కాజులూరు



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ సౌజన్య

సీజనల్ వ్యాధులపై అప్రమత్త అవసరమని గొల్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారిణి సౌజన్య అన్నారు. శనివారం గొల్లపాలెం పిహెచ్‌సి సిబ్బందికి వ్యాధులపై అవగాహన కల్పించారు. కిటకజనిత వ్యాధులు నివారణ మరియు నియంత్రణ, డయేరియ, టైఫాయిడ్, మలేరియా, ఫైలేరియా, డెంగు, చికెన్ గున్యా, మొదలగు వ్యాధులు ప్రభల కుండా నివారణ చర్యలపై సమక్షించారు. వాటర్ హెడ్ ట్యాంక్ క్లోరినేషన్, వాటర్ టెస్టింగ్, పరీక్షలు గురించి అవగాహన నిర్వహించారు. ప్రతిరోజు వైద్య సిబ్బంది గ్రామ పరిస్థితులను పరిశీలించి వైద్య సిబ్బందికి ఎప్పటికప్పుడు తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



చంటిబాబును సత్కరిస్తున్న యానిమేటర్లు, వెలుగు సిబ్బంది

చంటిబాబుని కలిసిన డ్వాక్రా యానిమేటర్లు

ప్రజాశక్తి - కిర్లంపూడి

మండల టిడిపి అధ్యక్షుడు చదరం చంటిబాబును కిర్లంపూడి మండల ఎపిఎంతో కలిసి డ్వాక్రా యానిమేటర్లు, వెలుగు సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు చంటిబాబుకు పూలమాల వేసి శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో గెద్దనపల్లి క్లస్టర్ సిసి లోవరాజు, గొనేడ క్లస్టర్ సిసి బేబీ, యానిమెటర్లు కర్రి శ్రీదేవి, దిమ్మిలి మేరి, కాకడ కృష్ణమ్మ, దుర్గడ చిన్ని పాల్గొన్నారు.

మొక్కు తీర్చుకున్న మంత్రి సుభాష్ అభిమాని

ప్రజాశక్తి - తాళ్లరేవు

ఎంఎల్ఎ వాసంశెట్టి సుభాష్ అభిమాని తిరుపతి వెళ్లి తలనీలాలు ఇచ్చి మొక్కును తీర్చుకున్నాడు. మండలంలోని మాధవరాయునిపేటకు చెందిన రెడ్డి శివాజీ ఎన్నికల్లో వాసంశెట్టి సుభాష్ విజయం సాధిస్తే తిరుపతి వచ్చి తలనీలాలు ఇస్తానని మొక్కుకున్నాడు. అనుకున్న విధంగానే సుభాష్ విజయం సాధించడంతో రెడ్డి శివాజీ తిరుపల్లి వెళ్లి తలనీలాలు ఇచ్చి మొక్కును తీర్చుకున్నాడు. తిరుగు ప్రయాణంలో మంగళగిరి వెళ్లి మంత్రి సుభాష్‌ను కలిసి తిరుపతి నుంచి తీసుకొచ్చిన వెంకటేశ్వరస్వామి చిత్రపటాన్ని అందచేశారు.

కొండెక్కిన కూరగాయల ధరలు

ప్రజాశక్తి-రాజోలు



కూరగాయల దుకాణం

కూరగాయల ధరలు కొండెక్కాయి. కొనాలంటేనే ప్రజలు బెంబేలెత్తుతున్నారు. నెల రోజుల్లో టమాట నాలుగు రెట్లు పెరగ్గా, మిగతా కూరలు 40 నుంచి 50శాతం పెరిగాయి. పచ్చిమిర్చి ముట్టుకుంటే ఘాటెక్కుతోంది. టమాట రూ.120కి చేరుకుమనది. మేమేం తక్కువ అన్నట్టు అన్ని కూరగాయల ధరలు వాటి వెంటే కొండెక్కి కూర్చున్నాయి. నెల రోజుల క్రితం ఉన్న ధరలతో పోల్చుకుంటే ప్రస్తుతం డబుల్ అవడంతో సామాన్య ప్రజలు బెంబేలెత్తుతున్నారు. మార్కెట్‌కు ఐదు వందల నోటుతో వెళ్లితే.. సగం సంచి కూడా నిండడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీంతో కిలో కొనేవారు, పావుకిలో సరిపెట్టుకుంటున్నారు. కూరగాయల సాగు తగ్గిపోవడం, వర్షాలతో తోటలు దెబ్బతినడం వల్ల ఈ పరిస్థితికి కారణమని తెలుస్తుంది. మార్కెట్‌కు ఎక్కువగా దిగుబడి వస్తే ధరలు అదుపులోకి వస్తాయని వ్యాపారులు అంటున్నారు. బహిరంగ మార్కెట్‌లో కంటే ఎంతో కొంత తక్కువ ధరలకు లభిస్తాయనుకుని రైతుబజారుల్లో సైతం ధరలు ఎక్కువగానే ఉంటున్నాయని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పండించే రైతుకు ఎంత వరకు గిట్టుబాటు ధర లభిస్తోందో గానీ.. దళారులు మాత్రం బాగుపడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

నాలుగు రకాల కూరగాయలు కొనలేని పరిస్థితి

సామాన్యుడు రూ.500 తీసుకుని మార్కెట్‌కు వెళ్తే పట్టుమని నాలుగు రకాల కూరగాయలు కొనలేని పరిస్థితి నెలకొంది. పచ్చిమిర్చి ధర రూ.100-120 చేరి అందనంత ఎత్తులో ఉంది. జహీరాబాద్, బీదర్ పట్టణాల్లో కాకుండా మండలంలోని వారంతపు సంతలు, వీధి దుకాణాల్లో సైతం కూరగాయల ధరలు పెరిగిపోవడంతో వాటిని కొనలేని పరిస్థితి నెలకొంది. నెల రోజుల క్రితం టమోట ధర రూ.10 నుంచి 20 ఉండగా నేడు ఏకంగా రూ.70 నుంచి 90 వరకు చేరింది. నిత్యం కూరల్లో ఉపయోగించే ఉల్లిపాయలు కూడా గతంలో రూ.25 ఉండగా నేడు ఒక్కసారిగా రూ.60కి మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. బీరకాయ, గోరుచిక్కుడు, వంకయ, కాకర కాయ, చిక్కుడు, బీట్‌రూట్, క్యారెట్, క్యాబేజీ, బీన్స్, ముల్లంగి తదితర కూరగాయల ధరలు రూ.80-100 మధ్య ఉండడంతో ప్రజలు బెంబెలెత్తుతున్నారు. మెంతి, పాలకూర, చుక్కకూర, గోంగూర వంటివి కూడా అధిక ధరలకు విక్రయిస్తున్నారు. ఏది ఏమైనప్పటికీ ధరల నియంత్రించడంలో ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

హక్కుల కోసం ఉద్యమించాలి

ప్రజాశక్తి - పెద్దాపురం

మహిళల హక్కుల పరిరక్షణ కోసం నిరంతరం ఉద్యమించాలని రైతు కూలీ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని పులిమేరు గ్రామంలో రంప ఏసమ్మ అధ్యక్షతన ప్రగతిశీల మహిళా సంఘం 50 వ వార్షికోత్సవ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన నాటి నుంచి మహిళలపై హత్యలు, అత్యాచారాలు, దాడులు విపరీతంగా పెరిగిపోయాయన్నారు. ముందుగా గ్రామంలో ప్రదర్శన నిర్వహించారు.

ప్రతి కార్యకర్త కుటుంబానికీ అండగా ఉంటాం

ప్రజాశక్తి - పెద్దాపురం



బాధిత కుటుంబాలను పరామర్శిస్తున్న దొరబాబు

ప్రతి వైసిపి కార్యకర్త కుటుంబానికి అండగా ఉంటామని వైసిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ దవులూరి దొరబాబు అన్నారు. మండలంలోని ఉలిమేశ్వరం గ్రామానికి చెందిన కాటంశెట్టి దొరబాబు, ఎండపల్లి మంగలక్ష్మి ఇటీవల గుండెపోటుతో మరణించారు. ఈ నేపథ్యంలోనే శనివారం వారి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించారు. వారి మృతికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనేక పథకాల ద్వారా సేవలు అందించిన వైసిపి ఓటమి చెందడాన్ని కార్యకర్తలు జీర్ణించుకోలేక పోతున్నారని అన్నారు. వైసిపి కార్యాలయాలు, వైసిపి కార్యకర్తలపై దాడులు జరుగుతున్నాయన్నారు. వైసిపి కార్యకర్తలకు అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసి గవరసాన సూరిబాబు, గోపు మురళి, ఆకుల వీరబాబు, పంచాది వీరవెంకటసత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భారీ వాహనాల రవాణాకు అడ్డుకట్ట వేయాలి

ప్రజాశక్తి - రౌతులపూడి

రౌతులపూడి పరిసరాల ప్రాంతం నుంచి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు స్టోన్ క్రషర్ ద్వారా నల్లరాయిని రవాణా సాగిస్తున్న భారీ వాహనాలపై చర్యలు తీసుకోవాలని దళిత బహుజన పార్టీ నాయకుడు నేతల కొండబాబు కోరారు. ఈ మేరకు కలెక్టర్ నివాస్ కలిసి భారీ వాహనాల రాకపోకలను వివరించారు. భారీ వాహనాల రవాణాను అరికట్టాలని కోరారు.